క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాపూర్: రాజాపూర్, బాలానగర్, నవాబుపేట మండలాలకు విద్యుత్ లైన్స్‌కు అదనంగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కారణంగా శనివారం, ఆదివారం విద్యుత్ సరఫరాలో మార్పులుంటాయని విద్యుత్‌శాఖ అధికారి సుజాత శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి తిరిగి యథావిధిగా కొనసాగుతుందని విషయాన్ని మండల రైతులు, వినియోగదారులకు గమనించి సహకరించాలని కోరారు.

జడ్చర్ల టౌన్: పోలేపల్లి 132 కేవీ, 33కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద టవర్స్ నిర్మాణం చేపడుతున్నందున శనివారం నుంచి సోమవారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాసులు తెలియజేశారు. సబ్‌స్టేషన్ల పరిధిలో వినియోగదారులకు సమాచారం అందించామని తెలిపారు.

దాతలు సహకరించాలి



అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం గ్రామానికి చెందిన బుచ్చన్న విద్యార్థులకు షూస్‌ను పంపిణీ చేశారు. 8, 9, 10వ తరగతికి చెందిన 44 మంది విద్యార్థులకు సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గోవర్దన్ వాటిని అందజేశారు. పాఠశాల అభ్యున్నతికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వనజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీఆర్‌ఎంకు సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్న బాబునాయక్‌ను శుక్రవారం తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు సన్మానం చేశారు. వరంగల్ రీజియన్ హన్మకొండ డిపో మేనేజర్ నుంచి పదోన్నతిపై ఈయన మహబూబ్‌నగర్‌కు వచ్చారు. జీఎల్‌గౌడ్, బసప్ప, కురుమయ్య, విజయబాబు, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

రాజాపూర్: చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని డీసీఎంఎస్ చైర్మన్‌ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నియోజకవర్గస్థాయి అండర్-14 విభాగంలో ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పె రిబచ్చిరెడ్డి, హెచ్‌ఎం ఆనంద్, ఫిజికల్‌డైరెక్టర్ వడ్డన్న పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 17వ వార్డు పరిధిలోని సత్యమన్నకాలనీలో శుక్రవారం ప్రజలకు తడి, పొడి చెత్తపై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోకు తడి, పొడి చెత్తను వేరు చేసిన తర్వాతే అందజేయాలని సూచించారు.

చదువుకు చేయూత

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాదేపల్లి బాలికల హైస్కూల్ చెందిన ఇద్దరు విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ అఖిలేష్‌రెడ్డి సహకారంతో ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. కారువంగకు చెందిన వర్షితకు (ఇంటర్) ప్రతినెలా రూ.3వేలు, బాదేపల్లికి చెందిన శిరీష్‌కు నెలకు రూ.2వేలు అందించేందుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు మొదటి నెలకు సంబంధించి నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సావిత్రి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, హెచ్‌ఎం కవిత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బాలానగర్: సీఎంఆర్‌ఎఫ్ పథకంతో సామాన్యులకు కొండంత అండ చేకూరుతుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాయపల్లి చెందిన అన్వరుల్లాకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటచారి, సర్పంచ్ శంకరప్ప, రవి, నాగేందర్ తదితరులు ఉన్నారు.



అందని బిల్లులతో అయోమయం



రుద్రారం క్రీడాప్రాంగణం

- ఇబ్బందులు పడుతున్న సర్పంచ్‌లు

నవాబుపేట: క్రీడా ప్రాంగణాలు వెంటనే నిర్మాణం చేపట్టాలని సర్పంచ్‌లపై, అధికారుల ఒత్తిడి తెచ్చి మరీ పనులు చేయించారు. పనులు పూర్తి చేసి ఏడాది గడిచినా బిల్లుల మాట ఊసెత్తటం లేదు. అప్పులు చేసి పనులు పూర్తి చేస్తే బిల్లుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో సర్పంచ్‌లు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ప్రతి పనికి అధికారులు పనులు చేయించేటప్పుడు చూపిన శ్రద్ధ వాటిని పూర్తి చేశాక బిల్లులు అడిగితే మొహం చాటేస్తున్నారని వాపోయారు.

అంచనాలకంటే అధిక ఖర్చు

మండలంలో రుద్రారం, నవాబుపేట, చెన్నారెడ్డిపల్లి, కేశవరావుపల్లిలో క్రీడా ప్రాంగాణాలకు సర్పంచ్‌లు అంచనాల కంటే అధికంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఒక్క క్రీడా ప్రాంగణానికి రూ.3.60 లక్షల బిల్లు రావాల్సి ఉంటుంది. కానీ గుంతలు తదితర వాటికి మరింత ఎక్కువగా డబ్బులు చెల్లించాల్సి ఉంది. అధికారులు వీటిని పక్కన బెట్టి బిల్లుల మాట దాటవేస్తున్నారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన స్థలం చాలా గుంతలతో ఉండటంతో వందలాది ట్రిప్పుల మొరంతో పూడ్చి మరీ గ్రౌండ్ ఏర్పాటు చేశారు. తీరా అధికారులు బిల్లుల విషయం ఆరాతీస్తే అదనపు పనికి డబ్బులు ఇచ్చే నిబంధనలు లేవని, అలాంటివి వస్తే చూద్దామంటూ సమాధానం దాటవేశారు.మండలంలో 54 క్రీడా ప్రాంగణాలకు గాను 24 పూర్తి చేశారు.

ఇబ్బంది పెట్టారు..



క్రీడా ప్రాంగణంలో బోర్డుతో పాటు ఇతర పరికరాలు అధికారులు సూచించిన ప్రకారం ఏర్పాటు చేస్తే వాటికి రూ.56 వేలు ఖర్చయ్యాయి. వీటిని మొత్తం వారి పర్యవేక్షణలోనే తయారు చేయించాం. తీరా బిల్లుల కోసం ఎంబీ రికార్డు మాత్రం కేవలం రూ.28 వేలు చేశారు. ఇదేంటని అడిగితే నిబంధనలు ఇంతే ఉన్నాయని అంటున్నారు. పని చేయాలని ఒత్తిడి తెచ్చి, తీరా పూర్తి చేశాక ఇబ్బందులు పెట్టడం సరికాదు.

– యాదయ్య, సర్పంచ్, చెన్నారెడ్డిపల్లి

సగం బిల్లు రాలే



పనులు చేసి ఏడాది గడిచిన ఇంకా సగం బిల్లు కూడా చేయలేదు. అడిగితే వస్తాయి.. చూద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇలాగైతే పనులు ఎలా చేయాలి. పనుల చేయాలని ఒత్తిడి తెచ్చిన అదికారులు బిల్లులు చేసేటప్పుడు ఎందుకు శ్రద్ధ చూపరు. సర్పంచ్‌లను ఇబ్బందులు పెట్టి అప్పుల పాలు చేయటమే వారి లక్ష్యంగా కనిపిస్తుంది. రూ.లక్షలు గ్రామం కోసమని అప్పులు తెస్తే ఏడాది గడిచినా బిల్లులు ఇవ్వకపోవడం అన్యాయం.

– గోపాల్‌గౌడ్, సర్పంచ్, నవాబుపేట

విచారణ చేయిస్తాం



బిల్లులు తక్కువా చేశారని సర్పంచ్‌లు ఆరోపించారు. ఈ విషయంలో ఎంబీలు తీసుకుని సంబంధిత అధికారులతో మరోసారి క్షేత్రస్థాయి పర్యటన చేసి పూర్తి విచారణ చేయిస్తాం. మండలంలో పూర్తి చేసిన అన్ని క్రీడాప్రాంగణాలు పరిశీలిస్తాం. బిల్లులు చెల్లించే విషయంలో ఇప్పటికే జిల్లా అధికారులకు వివరించాం. వెంటనే బిల్లులు వచ్చేలా చేయాలని కోరాం.

– శ్రీలత, ఎంపీడీఓ, నవాబుపేట

పరీక్ష కేంద్రాలు సిద్ధం



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



క్రిస్టియన్‌పల్లిలోని డిగ్రీ కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా వ్యాప్తంగా శనివారం గ్రూప్-4 పరీక్షకు శుక్ర వారం పట్టణంలోని పరీక్ష కేంద్రాల్లో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. టీడీగుట్ట, పోలీస్ లైన్ హైస్కూళ్లతో పాటు పాత డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, రేణుక ఎల్లమ్మ ఆలయం ఎదురుగా ఉన్న బాలికల జూనియర్ కళాశాల, క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, న్యూ బాలాజీనగర్‌లోని రవీంద్ర భారతి హైస్కూల్ ఆవరణ, పరిసరాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ముఖ్యంగా ఆయా తరగతి గదుల్లో బూజును దులిపించారు.

ధరల పెరుగుదలతో సామాన్యుల ఇబ్బందులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలతో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత అన్నారు. నిత్యవసరాలు, కూరగాయల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిత్యవసరాల ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమంపై సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే నిత్యవసరాల ధరలను తగ్గించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో సహజ, అమిత, అనితారెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న మహిళలు

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ పార్థసారథి

మహబూబ్‌నగర్ రూరల్: తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా తుది ఓటర్ల జాబితా రూపొందించాలని అర్బన్ తహసీల్దార్ పార్థసారథి సూచించారు. ఓటరు జాబితాపై శుక్రవారం కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేపట్టి అర్హులైన వారికి ఓటుహక్కు కల్పించాలని అన్నారు. వివిధ కారణాలతో జాబితా నుంచి పేర్లు తొలగిస్తే సంబంధిత కుటుంబీకులకు ఆ సమాచారం తెలియజేయాలని చెప్పారు. ఒకే ఇంట్లో ఆరుగురు కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తిస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలన పక్కాగా చేయాలని అన్నారు. 18–19 ఏళ్ల వయస్సు ఓటర్ల వివరాలు ప్రత్యేకంగా పొందుపరచాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ఎంత మంది నివసిస్తున్నారు.. పరిశీలించి మార్కింగ్ చేయాలన్నారు. దివ్యాంగులు ఓటరుగా నమోదు అయ్యారా లేదా పరిశీలించి ఓటరు జాబితాలో ఫారం-8 ద్వారా మార్కింగ్ చేయించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలు పరిశీలించాలని, ఒకవేళ పోలింగ్ స్టేషన్ భవనాలు శిథిలావస్థలో ఉంటే అవసరమైన చోట కొత్త కేంద్రాల కోసం ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో గిర్దావర్ నర్సింగ్, జూనియర్ అసిస్టెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో భారీ వాహనాలు

రాజాపూర్: ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ప్రచారాలు చేస్తున్న అవేవి వాహనాలు నడిపే వారికి పట్టడం లేదు. ప్రతిరోజు రద్దీగా ఉండే జాతీయ రహదారిపై మండలంలోని ముదిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్డు నుంచి పోలేపల్లి పారిశ్రామిక వాడలోకి వెళ్లే భారీ వాహనదారులు ప్రతి రోజు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. పక్కనే సర్వీస్‌రోడ్డు ఉన్నా వెళ్లకుండా రాంగ్ రూట్‌నే ఆశ్రయిస్తున్నారు. 2009లో ఇలానే రాంగ్‌రూట్‌లో టిప్పర్‌వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో అక్కడికక్కడే నలుగురు ప్రయాణికులు మృత్యువాతపడ్డారు. ఇలా ఎందరో అమాయకులు రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలకు తరచూ బలి అవుతూనే ఉన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ముదిరెడ్డిపల్లి నుంచి సెజ్‌లోకి వెళ్లేందుకు రాంగ్ రూట్‌లో వస్తున్న భారీ వాహనం

దుర్గాదేవికి ఘనంగా పూజలు



దేవరకద్ర: మండలంలోని లక్ష్మీపల్లిలో వెలసిన కనకదుర్గాదేవికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం దేవాలయంలో అష్టోత్తరములతో సామూహిక కుంకుమార్చన, మహా మంగళ నీరాజనం చేపట్టారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి సహస్ర లలితా పారాయణం చేశారు. అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

మున్సిపల్ సిబ్బందికి సన్మానం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం 11మంది సిబ్బంది ఉద్యోగ విరమణ పొందారు. వీరిలో తొమ్మిది మంది పారిశుద్ధ్య కార్మికులు, మరో ఇద్దరు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన వారు ఉన్నారు. ఈ సందర్భంగా వారిని ఇన్‌చార్జ్ ఏఎంసీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పదవీకాలంలో వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, హెల్త్ అసిస్టెంట్ వజ్ర కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలి

రాజాపూర్: గ్రామాలలోని ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలని డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నవెల్లిలో పౌరహక్కుల దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కులమత భేదాలు ఉండకూడదన్నారు. గ్రామాల్లో ఉన్న ఆలయాల్లోకి రానివ్వకుండా ఉంటే, రెండు గ్లాసుల పద్ధతి పాటిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తహసీల్దార్ రాంబాయి, సీఐ జమ్ములప్ప, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ రాధారెడ్డి, ఆర్‌ఐ ఖదీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



జడ్చర్ల: పౌరహక్కులకు భంగం వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు తెలిపారు. పౌరహక్కుల దినం సందర్భంగా శుక్రవారం మండలంలోని లింగంపేట పంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, హక్కులకు విరుద్ధంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు.

ప్రభుత్వ వైఫల్యమే కారణం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర వసతులు ఉన్నాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రుక్మద్దీన్ ఆరోపించారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో గుండె నిపుణులు లేకపోవడంతో సాయి చంద్‌కు సరైన వైద్య అందలేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని అన్ని విభాగాలకు వెంటనే స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికీ కేంద్ర పథకాలు

పాలమూరు: కేంద్ర ప్రభుత్వం రైతులతో పాటు పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకువచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.పీ వెంకటేష్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ 9ఏళ్ల నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలు అనే నినాదంతో శుక్రవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు నారాయణయాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బోయపల్లి, టీడీగుట్ట, ఖలీల్ చౌక్ ఏరియాలో నిర్వహించారు. పట్టణ చౌరస్తాల సుందరీకరణ పనులు కేంద్రం ఇచ్చిన అమృత్ సిటీ అభివృద్ధి నిధుల నుంచి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉండటం వల్ల ప్రతి పేదవాడికి మేలు కలుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డాక్టర్ చైతన్య, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, లక్ష్మీనారాయణ, అంజయ్య, వేణుగౌడ్, వెంకట్‌రాములు, శివ పాల్గొన్నారు.

శిథిలమైన పాఠశాల భవనం



కుచ్చర్‌కల్ ప్రభుత్వ ప్రాథమికోన్నతపాఠశాల

- విద్యార్థులను పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు
- మన ఊరు–మన బడిలో ఎంపిక కాని వైనం

రాజాపూర్: మండలంలోని కుచ్చర్‌కల్ ప్రభుత్వ పాఠశాల భవనం ఎప్పుడు కూలుతుందో అంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు మొత్తం 74 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. చినుకు పడిదంటే చాలు పాఠశాల తరగతి గదులు అన్ని కురుస్తుండటంతో పాటు స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుంది. కొన్నేళ్లుగా పరిస్థితి ఇలానే ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను మెరుగు పరిచేందుకు, పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు మన ఊరు–మన బడి పథకం తీసుకొచ్చింది. పథకంలో కుచ్చర్‌కల్ పాఠశాలను చేర్చకపోవడంతో రెండో దశలోనైనా పాఠశాలను పథకంలో చేర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంతేకాకుండా బీటీ రోడ్డు పక్కనే పాఠశాల ఉండటంతో ప్రహరీ లేకపోవడంతో రోడ్డుపై వెళ్తుండగా విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.



పైకప్పు ఊడిపడుతున్న కుచ్చర్‌కల్ ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు

క్లాస్‌లో కూర్చోలేం

వాన పడిందంటే ఎప్పుడు వాననీళ్లు, పైకప్పు తమ మీద కూలిపడుతుందోనని భయమేస్తోంది. ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే స్థోమత లేదు. మా సమస్యలు పట్టించుకుని కొత్త పాఠశాల భవనం నిర్మించాలి. వేరే ఊళ్లలో పాఠశాలలను చాలా మంచిగా చేశారు.

– అక్షయ, 7వ తరగతి

ఆడుకోవాలన్నా భయమే



ఖాళీ సమయంలో పిల్లలు బయటికి వచ్చి ఆడుకోవాలన్నా భయమే. కాంపౌండ్‌వాల్ లేనందున బయటికి వెళ్లిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో వారికి తెలియదు. పాఠశాల తరగతి గదులైతే చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. ఉన్న రూంలలో అన్ని కూలుతున్నాయి. ఒకటి అదనంగా కట్టినా అసంపూర్తిగానే వదిలేశారు.

– హెబ్సిబా, ఉపాధ్యాయురాలు

సమస్య తీర్చాలి



ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలి. ముఖ్యంగా పాఠశాలను ప్రతి రోజు శుభ్రం చేసేందుకు ఇబ్బందిగా ఉంది. పంచాయతీవారు తమకు వీలున్న సమయంలో వచ్చి ఊడుస్తున్నారు. దీంతో చెత్త అలానే ఉంటుంది.

– సమత, ప్రధానోపాధ్యాయురాలు